క్లుప్తంగా

ఎన్నికలు పకడ్బందీగా నిర్వహించాలి

గద్వాల రూరల్: పార్లమెంట్ ఎన్నికల ప్రక్రియ పకడ్బందీగా నిర్వహించేందుకు అన్ని చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్ సూచించారు. శుక్రవారం ఆయన వీసీలో మాట్లాడుతూ.. పోలింగ్ కోసం చేపట్టాల్సిన ఏర్పాట్లు, పోస్టల్ బ్యాలెట్, ఓటర్ సమాచార స్లిప్పుల పంపిణీ డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ కేంద్రాల వద్ద తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పోలింగ్ కేంద్రాల్లో టెంట్లు, విద్యుత్, తాగునీటి, ఫ్యాన్ల వంటి సదుపాయాలపై చర్యలు తీసుకోవాలన్నారు. పోలింగ్ కేంద్రాల నుంచి కౌంటింగ్ కేంద్రం వరకు ఈవీఎం తరలింపు కోసం అవసరమైన వాహనాలు సిద్ధం చేయాలని అధికారులు క్రియాశీలక పాత్ర పోషించాలని సూచించారు.

భగీరథ జయంతి ఘనంగా నిర్వహించాలి

గద్వాల అర్బన్: భగీరథ మహర్షి జయంతిని ఈ నెల 14న ఘనంగా నిర్వహించాలని ఉప్పర సంఘం జిల్లా అధ్యక్షుడు వెంకటేష్ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిఏటా భగీరథ మహర్షి జయంతిని ఘనంగా నిర్వహించేదని, ఈ సారి ఎన్నికల కోడ్ ఉన్నందున అధికారికంగా ఉత్సవాలు నిర్వహించేందుకు అవకాశం ఉండదన్నారు. దీంతో జిల్లాలోని గ్రామ, మండల కమిటీలు పెద్దఎత్తున్న జయంతి ఉత్సవాలు నిర్వహించి, ఐక్యమత్యం చాటాలన్నారు. సమావేశంలో ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి శేఖర్, సగర కోశాధికారి రవికుమార్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిక

ధరూరు: బీఆర్‌ఎస్ పార్టీ సీనియర్ నాయకులు, మండల జెడ్పీటీసీ సభ్యురాలు పద్మావెంకటేశ్వరరెడ్డి దంపతులు సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ సరిత ఆధ్వర్యంలో శుక్రవారం మక్తల్‌లో జరిగిన ప్రజా జనజాతర సభకు హాజరైన సీఎం సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు.

బీసీ నేతపై దాడి హేయం

గద్వాల: శ్రీకాళహస్తిలో బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్యపై జరిగిన దాడిని బీసీ ఉపాధ్యాయ సంఘం(బీసీటీఏ) తీవ్రంగా ఖండించింది. శుక్రవారం స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో బీసీటీఏ రాష్ట్ర అధ్యక్షుడు కృష్ణుడు మాట్లాడారు. తెలుగు రాష్ట్రాల్లో నాలుగు దశబ్దాలుగా బీసీల అభివృద్ధికి పోరాడుతున్న ఆర్.కృష్ణయ్యపై దాడి చేయడం అత్యంత హేయమైన చర్యని పేర్కొన్నారు. ఆర్.కృష్ణయ్యపై ఆధిపత్య కులాలు ఏదో చేయాలని కుట్రపన్ని దాడి చేశారన్నారని ఆరోపించారు. జరిగిన దాడిని తెలుగు రాష్ట్రాల్లోని బీసీలంతా గమనిస్తున్నారని చెప్పారు. ఎన్నికల సంఘం తక్షణమే స్పందించి దాడికి పాల్పడిన నిందితులను శిక్షించాలని డిమాండ్ చేశారు. బీసీటీఏ జిల్లా అధ్యక్షుడు బీకే వెంకటేష్, ప్రవీణ్‌కుమార్, శ్రీధర్, కృష్ణయ్య, మహేష్ పాల్గొన్నారు.

ఎలక్షన్ ఏజెంట్లకు శిక్షణ

అయిజ: మండల కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో శుక్రవారం బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి ఎలక్షన్ ఏజెంట్లకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా రామచంద్రారెడ్డి మాట్లాడారు. ప్రతి పోలింగ్ బూత్‌లో ఏజెంట్లు తప్పనిసరిగా ఎలక్షన్ కమిషన్ విధించిన నియమ నిబంధనలు పాటించాలని సూచించారు. బీజేపీ పథకాల ప్రాముఖ్యతను వివరిస్తూ.. ప్రతి ఒక్క బూత్‌లో అధ్యక్షుల పరిధిలో ప్రచారం చేయాలని సూచించారు. బీజేపీ అభ్యర్థి పోతుగంటి భరత్ ప్రసాద్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించేందుకు కృషిచేయాలని సూచనలు చేశారు. కార్యక్రమంలో ఎస్సీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మాదన్న, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి జలగరి అశోక్, పట్టణ అధ్యక్షుడు నరసింహయ్య శెట్టి, భగత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కుర్చీలు, ఫ్యాన్ల వితరణ



గద్వాల న్యూటౌన్: పట్టణంలోని బాలసదన్‌కు కెనరా బ్యాంకు ఎంప్లాయిస్ యూనియన్ వారు కుర్చీలు, ఫ్యాన్లు, టేబుళ్లను శుక్రవారం వితరణ చేశారు. కెనరా బ్యాంకు ఎంప్లాయిస్ యూనియన్ 74వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని యూనియన్ వైస్‌చైర్మన్ తిరుమల్‌రెడ్డి, రాష్ట్ర కమిటీ సభ్యులు సందీప్ దినకరణ్, ప్రభాకర్‌రెడ్డి వీటిని అందజేశారు.

కనులపండువగా రథోత్సవం

అయిజ: మండలంలోని భూంపురంలో శుక్రవారం బసవేశ్వరుడి రథోత్సవాన్ని భక్తులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. రథోత్సవంలో పాల్గొనేందుకు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు తరలివచ్చారు. స్వామివారి నామస్మరణతో భూంపురం గ్రామం మార్మోగింది. భక్తుల తాకిడితో ఆలయ పరిసరాలు కిక్కిరిసిపోయాయి.

గద్వాల అర్బన్: బసవేశ్వరుడి జయంతిని వీరశైవ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లా కేంద్రంలోని భద్రకాళి వీరభద్రస్వామి ఆలయంలో ఘనంగా నిర్వహించారు. బసవేశ్వరుడి చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. స్వామివారి చిత్రపటానికి ఆలయ ప్రధాన అర్చకుడు శివరాజ స్వామి శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. వీరశైవ సంఘం అధ్యక్షుడు రమేష్ బాబు, విజయ్‌కుమార్, గట్టు సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బసవ జయంతి

రాజోళి: మండల కేంద్రంలో బసవ జయంతిని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. జంగమ వీరశైవ సమాజం ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేశారు. ప్రత్యేక పూజా కార్యక్రమం నిర్వహించారు. అనంతరం పలువురు మాట్లాడారు. ఆయన జీవితంలోని విశేషాలను తెలియజేశారు. కార్యక్రమంలో బసవరాజు, అడివిస్వామి, వినోద్, శశి, మల్లేష్, సంజీవ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



అయిజ మండలం భూంపురంలో రథోత్సవం నిర్వహిస్తున్న భక్తులు



రాజోళిలో బసవ జయంతి వేడుకలు



గద్వాలలో బసవేశ్వరుడి చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న వీరశైవులు

జూరాల చేరని నారాయణపూర్ జలాలు

- ఎగువ నుంచి నీరు వదిలి మూడు రోజులైనా చేరని వైనం
- రెండ్రోజులుగా కురుస్తున్న స్థానిక వర్షాల ఆధారంగా ప్రాజెక్టుకు స్వల్ప ఇన్‌ఫ్లో

ధరూరు: ఎగువన ఉన్న నారాయణపూర్ ప్రాజెక్టు నుంచి దిగువన రాయచూరు సమీపంలో ఉన్న థర్మల్ విద్యుదుత్పత్తి కేంద్రం కోసం గుల్బార్ బ్యారేజీ వరకు ప్రాజెక్టుకు విద్యుదుత్పత్తి నిమిత్తం వదిలిన 1.9 టీఎంసీల నీరు జూరాలకు వస్తుందని భావించగా, ఇప్పటికీ చేరలేదు. వాస్తవానికి శుక్రవారం ఉదయం లేదా సాయంత్రానికే చేరాల్సి ఉంది. తాగునీటి అవసరాల కోసం 5వేల క్యూసెక్కుల నీటిని మాత్రమే జూరాల ప్రాజెక్టుకు చేరుతాయని భావించిన ఇరిగేషన్ అధికారులు ఆ నీళ్లు ఎప్పుడొచ్చి చేరుతాయా అని ఎదురు చూస్తున్నారు. శుక్రవారం రాత్రి 9 గంటల వరకు ప్రాజెక్టుకు కర్ణాటక జలాలు చేరలేదని జూరాల ప్రాజెక్టు గేట్స్ డివిజన్ ఈఈ జుబేర్ అహ్మద్ 'సాక్షి'కి తెలిపారు. రాయచూరు సమీపంలోని విద్యుదుత్పత్తి కేంద్రానికి వదిలిన నీళ్లు ఇక్కడికి రావని, కేవలం తాగునీటి కోసం వదిలిన 5వేల క్యూసెక్కులు మాత్రం వచ్చే అవకాశం ఉందని తెలిపారు. కాగా ప్రస్తుతం ప్రాజెక్టుకు ఎగువ నుంచి వస్తున్న 328 క్యూసెక్కుల నీళ్లు రెండు రోజులుగా స్థానికంగా కురిసిన వర్షాల ఆధారంగా మాత్రమే చేరుతున్నట్లు అధికారులు తెలిపారు. అయితే జూరాల ప్రాజెక్టు నీటి నిల్వ సామర్థ్యం 9.657 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 2.715 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

రోడ్ షోను విజయవంతం చేయండి



మాట్లాడుతున్న పీసీసీ అధికార ప్రతినిధి శేక్షావలి ఆచారి

అయిజ: పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా మండల కేంద్రంలో శనివారం నిర్వహించనున్న రోడ్ షోలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ముఖ్య అతిథిగా హాజరై పాల్గొంటారని, రోడ్ షోను విజయవంతం చేయాలని పీసీసీ అధికార ప్రతినిధి శేక్షావలి ఆచారి కోరారు. శుక్రవారం మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కార్యకర్తల సమావేశం నిర్వహించారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. కార్యక్రమంలో ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్, కాంగ్రెస్ అభ్యర్థి మల్లు రవి, నాగర్‌కర్నూల్ పార్లమెంట్ ఇన్‌చార్జ్ పీపీ మోహన్ తదితరులు పాల్గొంటారని చెప్పారు.

'బర్రెలక్కగా అడుగుతున్నా.. గెలిపించండి'



మానవపాడులో విజిల్ గుర్తుకు ఓటు వేయాలని కోరుతున్న కర్నె శిరీష(బర్రెలక్క)

మానవపాడు: లోక్‌సభ ఎన్నికల్లో స్వతంత్ర్య అభ్యర్థిగా నగర్‌కర్నూల్ పార్లమెంట్ స్థానం నుంచి పోటీలో ఉన్నానని విజిల్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కర్నె శిరీష(బర్రెలక్క) కోరారు. శుక్రవారం మండల కేంద్రంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. పార్లమెంట్ ఎన్నికల్లో విజిల్ గుర్తుపై ఓట వేయాలని అభ్యర్థించారు. యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు తీసుకొస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వరంగ సంస్థలు ప్రైవేటుపరం



మాట్లాడుతున్న టీపీజేఏసీ రాష్ట్ర కన్వీనర్ రవిచంద్ర

గద్వాల అర్బన్: పదేళ్ల బీజేపీ పాలనలో దేశాన్ని కార్పొరేట్ శక్తులకు ధారాదత్తం చేసి, ప్రభుత్వరంగ సంస్థలన్నింటిని ప్రైవేటు పరం చేశారని టీపీజేఏసీ రాష్ట్ర కన్వీనర్ రవిచంద్ర అన్నారు. టీపీజేఏసీ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లా కేంద్రంలోని టీఎన్‌జీఓ భవనంలో ఓటరు చైతన్య సభ నిర్వహించారు. ఈ సభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వంలో అధికారంలో ఉన్న మోదీ నాయకత్వంలోని బీజేపీ ప్రజల్ని భయ భ్రాంతులకు గురిచేస్తుందన్నారు. రాజ్యాంగ హక్కుల్ని కాలరాసి నియంతృత్వ, ఫాసిస్టు పాలన విధానాలు సాగిస్తున్నారన్నారు. దీంతో దేశ ప్రజలు ప్రధాన సమస్యలైన సమానత్వం, శ్రమసంపద, సమాన పంపిణీ, ప్రజాస్వామిక పాలన కోసం సాగించాల్సిన ఉద్యమాల నుంచి దృష్టి మళ్లించడానికి దేశవ్యాప్తంగా ప్రశ్నించే, పోరాడే ప్రజలపై హింసాయుత దాడులు చేస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో చైతన్య మహిళ సంఘం రాష్ట్ర కన్వీనర్ జ్యోతి, రైతాంగ సమితి నాయకుడు గోపాల్, టీపీఎఫ్ ప్రభాకర్, ఇక్బాల్ పాషా, రహమతుల్లా, నాగన్న, జయమ్మ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలపై భారం మోపే పార్టీలను తరిమికొట్టాలి



బుక్‌లెట్‌ను విడుదల చేస్తున్న సీపీఎం నాయకులు

రాజోళి: ప్రజలపై అధిక భారాలను మోపే బీజేపీని, దాని కోసం పనిచేస్తున్న బీఆర్‌ఎస్ పార్టీలను తరిమికొట్టాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎ.వెంకటస్వామి అన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన జనరల్ బాడీ సమావేశంలో ఆయన మాట్లాడారు. వివిధ రంగాల్లో ఉన్న కార్మికులు తమ జీవనం గడిపేందుకు కూడా ఎంతో ఇబ్బందులు పడుతూ ముందుకు సాగుతున్నారని, దానికి కారణం కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వమేనన్నారు. నిత్యావసర సరుకుల ధరలను ఆకాశానంటించిన మోదీ నిరంకుశ పాలనతో ప్రజలు విసిగిపోయి ఉన్నారన్నారు. కాంగ్రెస్ పార్టీకి మద్దతు ఇచ్చి కాంగ్రెస్ పార్టీని గెలిపించేందుకు సీపీఎం, అనుబంధ సంస్థలు కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి విజయ్ కుమార్, సీఐటీయూ నాయకులు లక్ష్మన్న, జయన్న, తిక్కన్న తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర బలగాల ఫ్లాగ్‌మార్చ్



ఎర్రవల్లిచౌరస్తా: ఇటిక్యాల మండల పరిధిలోని ఉదండాపురంలో ఎస్‌ఐ వెంకటేష్ ఆధ్వర్యంలో శుక్రవారం కేంద్ర సాయుధ బలగాలతో ప్రత్యేక కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీస్ సిబ్బందితో కలిసి ఐటీబీఎఫ్ జవాన్లు గ్రామంలోని ప్రధాన వీధుల్లో తిరుగుతూ.. ఓటర్లకు ఎన్నికల హక్కులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ వెంకటేష్ మాట్లాడారు. ఈ నెల 13న జరిగే ఎన్నికల్లో ప్రజలు ఎవరికి కూడా బయపడకుండా తమకు ఇష్టం ఉన్నవారికి ఓటును వేసుకోవచ్చని తెలిపారు. ప్రజలకు పోలీసులు ఎల్లప్పుడు తోడుగా ఉంటారని ధైర్యం కల్పించేందుకే ఫ్లాగ్‌మార్చ్‌ను నిర్వహిస్తున్నామన్నారు. ఓటర్లు ఎలాంటి ప్రలోభాలకు గురికాకుండా స్వచ్ఛందంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. ఎవరైనా అభ్యర్థులు, వివిధ పార్టీలకు చెందిన నాయకులు ఓటర్లపై దౌర్జన్యం చేసినా, ఇబ్బందులకు గురిచేసినా స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేయాలని పేర్కొన్నారు. కైలాస్‌రామ్, జవాన్లు, పోలీస్ సిబ్బంది తదితరులు ఉన్నారు.

ఉపాధి హామీపై సామాజిక తనిఖీ



రాజోళి: సామాజిక తనిఖీ చేయటంతో ఉపాధి హామీ పనుల్లో జరిగిన ప్రతి పని వివరాలు వెల్లడవుతాయని డీఆర్‌డీఓ నర్సింగరావు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో ఉపాధి హామీ సోషల్ ఆడిట్ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ నెల 1 నుంచి 10వ తేదీ వరకు మండలంలోని అన్ని గ్రామాల్లో సోషల్ ఆడిట్ బృందం సర్వే నిర్వహించారు. 2023–24 సంవత్సరంలో 400 పనులకు సంబంధించి రూ.4 కోట్ల మేర పనులు జరిగాక వాటికి సంబంధించిన రూ.38 వేలు జరిమానా విధించినట్లు వెల్లడించారు. కాగా బృందం గ్రామాల్లో పర్యటిస్తూ పనులకు వెళ్లే కుటుంబాలను కలిసి వారికి పని కల్పన, కూలీ డబ్బుల చెల్లింపు, పని చేసిన రోజుల వివరాలు తదితర అంశాలను పరిగణలోకి తీసుకున్నారు. ఏపీఓ శ్రీనివాస్, క్వాలిటీ కంట్రోల్ అధికారి అశోక్, ఎంపీడీఓ రమేష్ పాల్గొన్నారు.

రైతుబీమా చెక్కు పంపిణీ



గట్టు: మండల పరిధిలోని ముచ్చోనిపల్లెలో శుక్రవారం ఎంపీపీ విజయ్‌కుమార్ రైతుబీమా చెక్కును బాధిత కుటుంబానికి అందజేశారు. ముచ్చోనిపల్లెకు చెందిన రైతు ఈరన్న ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతిచెందగా.. రైతు కుటుంబానికి రైతు బీమా ద్వారా రూ.5 లక్షలు మంజూరయ్యాయి. రైతుబీమా చెక్కును ఎంపీపీ విజయ్‌కుమార్ మృతుడి భార్య సుజాతకు రూ.5 లక్షల చెక్కును అందజేశారు. నర్సింహులు, చిన్న గోవిందు, పాల్గొన్నారు.

ఇద్దరికి తీవ్ర గాయాలు

ఉండవెల్లి: బైక్ అదుపు తప్పి కింద పడిపోవడంతో కర్నూల్‌కు చెందిన ఇద్దరు వ్యక్తులకు తీవ్ర గాయాలయ్యాయి. పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి. కర్నూల్‌కు చెందిన అజయ్, ఉమేష్ మద్యం తాగేందుకు శుక్రవారం అలంపూర్ చౌరస్తాకు వచ్చారు. మద్యం తాగి బైక్‌పై కర్నూల్‌కు వెళ్తున్నారు. ఉండవెల్లి వద్ద కారును ఓవర్‌టేక్ చేయబోయారు. బైక్ అదుపు తప్పి రోడ్డు పక్కన పడటంతో శరీర భాగాలకు తీవ్ర గాయాలయ్యాయి. హైవే అంబులెన్స్‌లో కర్నూల్ ఆస్పత్రికి తరలించారు.

వినూత్న కార్యక్రమాలు భేష్

అయిజ: అయిజ సింగిల్ విండోలో చేపడుతున్న వినూత్న కార్యక్రమాలు బాగున్నాయని నాబార్డ్ రాష్ట్ర రిటైర్డ్ సీజీఎం రవీందర్ అన్నారు. సహకార వ్యవస్థ అభివృద్ధి కమిటీ అధ్యయనంలో భాగంగా పంజాబ్, హర్యానా, ఉత్తర్‌ప్రదేశ్, బీహార్, తెలంగాణ రాష్ట్రాల సహకార సంఘాల పనితీరుపై అధ్యయనంలో భాగంగా అయిజలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో నిర్వహిస్తున్న వివిధ వ్యాపారాల అభివృద్ధిని రాష్ట్ర అపెక్స్ బ్యాంక్ అసిస్టెంట్ జనరల్ మేనేజర్ బ్రిజేష్, డీసీసీబీ ముఖ్య కార్యనిర్వహణ అధికారి టి.లక్ష్మయ్య, పీడీ సెల్ ఇన్‌చార్జ్ అశోక్ కుమార్‌తో కలిసి శుక్రవారం నాబార్డ్ రాష్ట్ర రిటైర్డ్ సీజీఎం రవీందర్ సందర్శించారు. పీఏసీఎస్‌లో నిర్వహిస్తున్న సూపర్‌మార్కెట్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సహకారా సంఘాలు కేవలం రుణాలు ఇచ్చేందుకే పరిమితం కాకుండా సేవలతో కూడిన వ్యాపారాలు చేస్తే అటు ప్రజలకు మేలు జరగడమే గాక సహకారా సంఘాలు కూడా ఆర్థికంగా బలోపేతం అవుతాయని అన్నారు. పీఏసీఎస్ ప్రెసిడెంట్ మధుసూదన్‌రెడ్డి, కార్యదర్శి మల్లేష్, సిబ్బంది జీవన్, ఆంజనేయులు, శ్రీను, భీమార్జున్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



పీఏసీఎస్ సూపర్‌మార్కెట్‌ను పరిశీలిస్తున్న అధికారులు

'బీఆర్‌ఎస్ అభ్యర్థిని గెలిపించండి'



చాగదోనలో ప్రచారం నిర్వహిస్తున్న ఎంపీపీ, బీఆర్‌ఎస్ నాయకులు



కేటీదొడ్డిలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న నాయకులు

అయిజ: పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా నాగర్‌కర్నూల్ స్థానం నుంచి పోటీ చేసిన బీఆర్‌ఎస్ అభ్యర్థి ఆర్‌ఎస్ ప్రవీణ్ కుమార్ మండల కేంద్రలో శుక్రవారం రోడ్ షో నిర్వహించారు. ఆయనకు మద్దతుగా ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి, అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు రోడ్ షోలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా చల్లా వెంకట్రామిరెడ్డి మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి, బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ బలపర్చిన అభ్యర్థి ఆర్‌ఎస్ ప్రవీణ్ కుమార్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. అదేవిధంగా అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు మాట్లాడారు. బీఆర్‌ఎస్ అభ్యర్థికి ప్రజలు ఓటు వేసి గెలిపిస్తే ఎమ్మెల్యే, ఎంపీలం కలిసి ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తామని అన్నారు.

గెలుపు ఖాయం

కేటీదొడ్డి: నాగర్‌కర్నూల్ పార్లమెంట్ బీఆర్‌ఎస్ అభ్యర్థి ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ గెలుపు ఖాయమని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు ఉరుకుందు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో ఇంటింటి ప్రచార కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఆరు గ్యారంటీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని అన్నారు. అనంతరం గ్రామంలోని ఉపాధిహామీ పనులు చేస్తున్న కూలీల వద్దకు వెళ్లి ప్రచారం నిర్వహించారు. నాయకులు హనుమంతు, గోవిందు, నసీర్, కొండన్న, యుగందర్, వీరేష్ తదితరులు ఉన్నారు.

చాగదోనలో..

గట్టు: మండల పరిధిలోని చాగదోన గ్రామంలో శుక్రవారం ఎంపీపీ విజయ్‌కుమార్ ఇంటింటా తిరుగుతూ బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి ప్రవీణ్‌కుమార్ తరపున ప్రచారం నిర్వహించారు. నాగర్‌కర్నూలు పార్లమెంట్ నియోజక వర్గం నుంచి బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి ప్రవీణ్‌కుమార్‌ను గెలిపించాలని ఎంపీపీ విజయ్‌కుమార్ ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు మునిచంద్రగౌడు, శివప్ప, గూరన్న, వడ్డే వీరేష్, నర్సింహులు, నాగన్న, ఉసేన్, తాయప్ప, శేషాద్రి, ప్రవీణ్ గంగన్న, సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పథకాలతో మోసపోకండి

ఉండవెల్లి: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి ఐదు నెలలవుతున్నా.. పథకాల పేర్లు చెప్పి మభ్యపెడుతున్నారు. కాంగ్రెస్ పథకాలతో మోసపోకండని ఉమ్మడి మహబూబ్‌నగర్ ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి అన్నారు. శుక్రవారం నాగర్‌కర్నూల్ బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ ప్రచారంలో భాగంగా ఉండవెల్లి మండలంలో వీఆర్ కాలనీ నుంచి బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా అభ్యర్థి ఆర్‌ఎస్ ప్రవీణ్ కుమార్ మాట్లాడారు. పథకాల పేరు చెప్పి ఓట్లు అడుగుతున్నారని, కాని పథకాలు అమలు చేయని ప్రభుత్వంగా మారిందన్నారు.

హామీలతో ప్రజలను మోసం చేసిన కాంగ్రెస్

మానవపాడు: ఆరు గ్యారంటీలతో కాంగ్రెస్ ప్రజలను మోసం చేసిందని బీఆర్‌ఎస్ ప్రధాన కార్యదర్శి డా. ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్, ఉమ్మడి జిల్లా ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి, ఎమ్మెల్యే విజేయుడు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో నిర్వహించిన బీఆర్‌ఎస్ రోడ్‌షో పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో ఎంపీపీ అశోక్‌రెడ్డి, శేషిరెడ్డి, దామోదర్‌రెడ్డి, మురళీధర్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రశ్నించే గొంతుకను గెలిపించుకుందాం..

అలంపూర్: మన సమస్యలను పార్లమెంట్‌లో ప్రశ్నించే గొంతుకగా ఉన్న ప్రవీణ్‌కుమార్‌ను గెలిపించుకుందామని అలంపూర్ మున్సిపల్ చైర్‌పర్సన్ మనోరమ పిలుపునిచ్చారు. అలంపూర్ మున్సిపాలిటీలోని 2వ వార్డులోని సంతోష్‌నగర్ కాలనీలో నాగర్‌కర్నూల్ పార్లమెంట్ బీఆర్‌ఎస్ అభ్యర్థి ఆర్‌ఎస్ ప్రవీణ్ కుమార్‌కు మద్దతుగా మున్సిపల్ చైర్‌పర్సన్ శుక్రవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్ అభ్యర్థిని గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. అనంతరం మాట్లాడారు. ప్రజలకు సేవ చేయాలనే ఉద్దేశంతో పదవిని త్యజించిన ప్రజల్లోకి వచ్చారన్నారు. ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. చిట్టెమ్మ, మద్దమ్మ, నాయకులు రాజేష్, హరిబాబు, రాజు, సురేష్ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే ప్రాంత అభివృద్ధి సాధ్యం



ధరూరు: కోతులగిద్దలో ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న బండ్ల లక్ష్మీదేవమ్మ



నందిన్నెలో ప్రచారం నిర్వహిస్తున్న కాంగ్రెస్ నాయకులు

ధరూరు: నాగర్‌కర్నూల్ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి మల్లురవిని భారీ మెజార్టీతో గెలిపించాలని మాజీ మార్కెట్ యార్డు చైర్‌పర్సన్ బండ్ల లక్ష్మీదేవమ్మ అన్నారు. శుక్రవారం ఆమె మండల పరిధిలోని కోతులగిద్ద, బూరెడ్డిపల్లి, ఓబులోనిపల్లి గ్రామాల్లో కాంగ్రెస్ అభ్యర్థికి ఓటు వేయాలని ప్రచారం చేశారు. కాంగ్రెస్‌కు భారీ మెజార్టీ వచ్చేలా కృషి చేయాలన్నారు. ఈ సందర్భంగా మాట్లాడారు. మనందరి లక్ష్యం ఒక్కటేనని, కాంగ్రెస్‌తోనే ప్రాంత అభివృద్ధి సాధ్యమన్న విషయాన్ని ప్రతిఒక్కరూ గుర్తుంచుకోవాలన్నారు. ఆనంద్‌రెడ్డి, రమేష్‌రెడ్డి, రంగన్న పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే ధ్యేయం

కేటీదొడ్డి: పేదల సంక్షేమమే కాంగ్రెస్ ధ్యేయమని కాంగ్రెస్ సీనియర్ నాయకులు వీరన్న అన్నారు. శుక్రవారం మండలంలోని నందిన్నెలోని ఎంపీ అభ్యర్థి మల్లురవికి మద్దతుగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. ప్రతిపక్షాల మాటలు నమ్మి మోసపోవద్దన్నారు. ఎంపీ అభ్యర్థి మల్లురవిని భారీ మెజార్టీతో గెలిపించుకోవాలని సూచించారు. మహదేవ్, గబ్బర్‌వీరన్న, రాఘవేంద్ర తదితరులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యాన్ని కాపాడాలి

మానవపాడు: జిల్లా వ్యాప్తంగా ఉన్న ఇండియా కుటమి అభ్యర్థులను గెలిపించాలని సీపీఐ నాయకులు ఆంజనేయులు కోరారు. శుక్రవారం మండల కేంద్రంలో లోక్‌సభ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఏఐఎస్‌ఎఫ్ కార్యదర్శి కృష్ణ, సీపీఐ నాయకులు ఉరుకుందు, బిజ్జిబాబు శివ, వెంకట్రాములు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ, బీఆర్‌ఎస్ పాలనలో ఒరిగిందేమిలేదు

అలంపూర్: కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో బీఆర్‌ఎస్ పదేళ్ల పాలనలో ప్రజలకు ఒరిగిందేమి లేదని సీపీఐ జిల్లా కార్యదర్శి ఆంజనేయులు అన్నారు. అలంపూర్ మున్సిపాలిటీతో పాటు ఆయా గ్రామాల్లో నాగర్‌కర్నూల్ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి మల్లురవికి మద్దతుగా సీపీఐ జిల్లా కార్యదర్శి శుక్రవారం ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ పాలనలో దేశం 20 ఏళ్ల అభివృద్ధి వెనక్కి వెళ్లిందన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్ శక్తులకు అప్పనంగా కట్టబెట్టిందని ఆరోపించారు. దేశ ప్రజలను మోసం చేసిన మోదీ ప్రభుత్వానికి బుద్ధి చెప్పటానికి ప్రజలు సిద్ధంగా ఉండాలన్నారు. కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీలో ఉన్న మల్లురవిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నియోజకవర్గ ఇన్‌చార్జ్ పెద్ద బాబు, కృష్ణ, ఉరుకుందు, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ, బీఆర్‌ఎస్‌కు ఓటేస్తే మత కల్లోలాలే..

ఉండవెల్లి: మండల కేంద్రం, కంచుపాడు గ్రామాల్లో సీపీఐ జిల్లా క్యార్యదర్శి ఆంజనేయులు నాగర్‌కర్నూల్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి మల్లురవిని గెలిపించాలని కోరారు. శుక్రవారం ఇంటింటా సీపీఐ నాయకుల ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు.

సీపీఎం నాయకుల ప్రచారం

గట్టు: మండల పరిధిలోని గొర్లఖాన్‌దొడ్డిలో శుక్రవారం సీపీఎం నాయకులు కాంగ్రెస్ తరపున ఎన్నికల ప్రచారం నిర్వహించారు. సీపీఎం జిల్లా నాయకులు వీవీ నర్సింహ, నర్మద గ్రామంలోని ఉపాధి కూలీలను కలిసి కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి మల్లురవికి ఓటు వేయాలని కోరారు. బొజ్జయ్య నాయుడు, ఆంజనేయులు, ఉరుకుందు, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

మల్లురవి గెలుపునకు కృషి చేయండి

ధరూరు: కాంగ్రెస్ బలపరిచిన మల్లురవి గెలుపునకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ సరిత, ఉమ్మడి పాలమూరు జిల్లా మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ బండారి భాస్కర్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు బండ్ల చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. కేసీఆర్ ప్రభుత్వాన్ని ఎలా అయితే గద్దె దింపామో.. అదే మాదిరిగానే నరేంద్ర మోదీ ప్రభుత్వాన్ని గద్దె దింపాలని కోరారు. శుక్రవారం వారు మండల కేంద్రంలోని కుర్వ వీధి, కోతులగిద్ద, జాంపల్లి గ్రామాలతో పాటు ధరూరు పెద్దచెరువు వద్ద ఉపాధి కూలీలను కలిసి మాట్లాడారు.

బడుగు బలహీన వర్గాల అభివృద్ధే లక్ష్యం

మల్దకల్: బడుగు బలహీన వర్గాల అభివృద్ధే కాంగ్రెస్ పార్టీ ప్రధాన లక్ష్యమని కాంగ్రెస్ పార్టీ నాయకులు బిజ్వారం శ్రీనివాసరెడ్డి, కృష్ణారెడ్డి, రాజశేఖర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని బిజ్వారం, ఉలిగేపల్లి, మేకలసోంపల్లి, మల్దకల్, తాటికుంట, అమరవాయి గ్రామాల్లో మల్లు రవి తరపున కాంగ్రెస్ పార్టీ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు.

ప్రజాపాలనను ఆదరించండి

మానవపాడు: రైతులకు రుణమాఫీ చేస్తుందని కాంగ్రెస్ పార్టీ హస్తం గుర్తుకు ఓటు వేయాలని లోక్‌సభ పార్లమెంట్ అభ్యర్థి మల్లు రవి కోరారు. శుక్రవారం మండలంలోని బోరవెల్లిలో మాజీ ఎమ్మెల్యే సంపత్ కుమార్‌తో కలిసి కాంగ్రెస్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు.



ధరూరు కుర్వవీధిలో మాట్లాడుతున్న జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ సరిత